మా ఊరి దేవుడు.. కోదండ రాముడు

◆ భక్తిశ్రద్ధలతో ప్రథమ బ్రహ్మోత్సవాలు



భాగ్యనగర్‌కాలనీ: షంషీగూడలోని శిల్పా బృందావనం శ్రీ కోదండ రామస్వామి ప్రథమ బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 4.30కు సుప్రభాతం, 5.30కు రథారోహణాంగ, నవగ్రహ పూజ, నవగ్రహదానం, 6కు రథారోహణం, 6.30కు స్వామి రథగమనం,10.30కు ఉత్సవమూర్తికి అభిషేకం, 12కు ఆరాధన, సాయంత్రం 5.30కు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, 6కు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, 8.30కు తిరుచ్చి ఉత్సవం, 9.30కు ఏకాంత సేవ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

అందరూ ఉన్నా.. అనాథగా జీవిస్తున్నా



అందరూ ఉన్నా తెలంగాణ తల్లి నీడన జీవచ్ఛవంలా పడి ఉంది ఓ తల్లి. అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్ వార్డు కార్యాలయం సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దే నెల రోజులుగా ఓ వృద్ధురాలు ఉంటోంది. ఆమె ఎవరని ఆరాతీయగా కుటుంబసభ్యులు ఉన్నా వారు పట్టించుకోవడం లేదని తెలిసింది. అసలు వివరాలు తెలుసుకుందామని సాక్షి ప్రతినిధి వృద్ధురాలిని కదిలిస్తే కన్నీటిపర్యంతమైంది. కన్న వారి నుంచే తనకు ఆదరణ కరువైందని ఆవేదన వ్యక్తం చేసింది. – మోతీనగర్

విజిటబుల్ పోలీసింగ్



విజిటబుల్ పోలీసింగ్‌లో భాగంగా మూసాపేటలో కూకట్‌పల్లి పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. మూసాపేట పరిధిలోని జనతానగర్, యాదవబస్తీ, హనుమాన్‌చౌక్‌లలో ఈ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా బలానగర్ డీసీపీ టి.శ్రీనివాసరావు, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సిఐ నర్సింగరావు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, సెక్టార్ ఎస్సై రామకృష్ణ, క్రైమ్, లాఅండ్ఆర్డర్ సిబ్బంది పాల్గొన్నారు. – భాగ్యనగర్‌కాలనీ

క్లుప్తంగా

నేడు సంతాన సాఫల్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లోని నీలిమ ఆస్పత్రిలో ఈనెల 17న ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఎండీ డా.శ్రీనివాస్, ప్రముఖ గైనకాలజిస్టు డా. నీలిమ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి ఉర్దూ ఫిల్మ్ ఫెస్టివల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) మొట్టమొదటిసారిగా ఉర్దూ ఫిల్మ్ ఫెస్టివల్‌ను శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను శుక్రవారం రాత్రి 7 గంటలకు ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో భారతీయ చలనచిత్ర రంగంలో ఉర్దూ భాష, సంస్కృతి యొక్క సహకారాన్ని ప్రదర్శించే డాక్యుమెంటరీతో ప్రారంభమవుతుందన్నారు.

భారత్ లక్ష్యం స్వదేశీ సాంకేతికత

● డీఆర్డీఓ శాస్త్రవేత్త రాజేశ్

పటాన్‌చెరు టౌన్: దేశీయంగా రూపొందించి, అభివృద్ధి చేసి, సొంత సాంకేతికతను సాధించే లక్ష్యంతో మన దేశం ముందుకు సాగుతోందని రక్షణ రంగ పరిశోధన సంస్థ (డీఆర్డీఓ) శాస్త్రవేత్త రాజేశ్ ఎస్.కర్వాండే అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం హవానా - 2.0పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ అంతర్ కళాశాల సాంకేతికోత్సవానికి హాజరై మాట్లాడారు. వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు ఉండి, వాటికి నిధులు అవసరమైతే విద్యార్థులు డీఆర్డీఓను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా జంట నగరాల్లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన దాదాపు 20 సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు నరేశ్‌కుమార్, డాక్టర్ అనిత, ప్రవీణ్, జీఎలక్ట్రా అధ్యక్షుడు ఎం.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలి

● ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ చిన్మయి తమ్మారెడ్డి

హఫీజ్‌పేట్ : నేడు యువతులు తమ జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్, లైఫ్ కోచ్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ చిన్మయి తమ్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ ఆవరణలో ఇంద్రజిత్ గుప్తా మెమోరియల్ హాల్‌లో మహిళా సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్మయిని సీఆర్ ఫౌండేషన్ హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళ సంక్షేమ కేంద్ర డైరెక్టర్ డి.కృష్ణకుమారి, సభ్యులు జోస్య భట్ల, కోశాధికారి చెన్నకేశవరావు, సంఘం మహిళలు పాల్గొన్నారు.

సామాజిక మార్పునకు డాక్యుమెంటరీలు దోహదం



రాయదుర్గం: సమస్యలపై అవగాహన పెంచడం..సామాజిక మార్పును ప్రోత్సహించడానికి డాక్యుమెంటరీ చిత్రాలు దోహదం చేస్తాయని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్‌ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మూడురోజుల డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్స్‌పై 'మనూ' ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ), ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్(ఐడీపీఏ)ముంబయి సంయుక్తంగా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. గురువారం వర్క్‌షాప్‌ను ప్రారంభించి వీసీ మాట్లాడారు. డాక్యుమెంటరీ చిత్రాల ప్రాముఖ్యత ఎంతో ఉందని, డాక్యుమెంటరీ మేకింగ్ గురించి ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా జ్ఞానాన్ని పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, ఓఎస్‌డీ–2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, ఐడీపీఏ అధ్యక్షుడు సంస్కర్‌దేశాయ్, ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్, నిర్మాతలు మహ్మద్ ముజాహిద్ అలీ, ఒమర్ ఆజ్మీ తదితరులు ప్రసంగించారు.

రెచ్చిపోతున్న కుక్కలు

● తల్లి అక్కడే ఉండటంతో తప్పిన ప్రాణాపాయం
● ప్రథమ చికిత్స అనంతరం కోఠిలోని ఆస్పత్రికి తరలింపు

సఫ్దార్‌నగర్ డీ–బ్లాక్‌లో బాలుడిపై దాడి



అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్ డీ-బ్లాక్‌లో కుక్క కాటుకు గురైన బాలుడు



మోతీనగర్: నగరంలో ఎక్కడ చూసినా వీధి కుక్కల హడావుడి అంతా ఇంతా కాదు. ఇటీవల ఓ చిన్నారి మృతి చెందినా సంబంధిత అధికారుల్లో అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూసాపేట జీహెచ్ఎంసీ సర్కిల్ అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్ డీ–బ్లాక్‌లో షబ్‌నాం, అఫ్రోజ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు యాసిన్ (5). బుధవారం రాత్రి సమయంలో వీధి కుక్కలు గుంపులుగా చిన్నారిపై దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు కొండాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం కోఠిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేశారు.ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ... కుక్కదాడి చేసే సమయంలో తల్లి అక్కడే ఉన్నది కాబట్టి కుక్కలను తరిమి కొట్టిందన్నారు. ఆ బాలుడి తల్లి మీదకు కూడా కుక్క దాడి చేయటానికి ప్రయత్నించిందన్నారు. ఆమె అక్కడే ఉండటంతో బాలుడు పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డాడని తెలిపారు.

◆ వీధికుక్కల బెడద ఎక్కువైతే వాటిని సుదూర ప్రాంతంలో వదిలిపెట్టేవారు. కేంద్ర నిబంధనల ప్రకారం ఇటీవల గ్రామ సింహాలకు కుటుంబ నియంత్రణ చికిత్స చేయించి ఎక్కడ నుంచి తీసుకువచ్చారో అక్కడే వదిలేస్తున్నారు. దీంతో రోజురోజుకూ వీధి కుక్కలు గుంపులు గుంపులుగా చేరి చిన్నారులపై దాడులకు ఎగబడుతున్నాయి. రాత్రి వేళల్లో అటుగా వెళ్లే వారిపై మూకుమ్మడిగా దాడులకు దిగుతున్నాయి. అర్ధరాత్రి పూట పెద్దగా అరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది వాటిని పట్టుకోవడానికి వచ్చినప్పుడు అవి వారి వాహనాన్ని చూసి పారిపోతున్నాయి. పకడ్బందీగా కాలనీలు, బస్తీల్లో గుంపులుగా ఉండే కుక్కలను తీసుకెళ్లాలని కోరుతున్నారు.

ప్రతి ఆస్పత్రిలో కుక్క కాటు నివారణ వ్యాక్సిన్ ఉండాలి

ముఖ్యంగా నగరంలో ప్రతి వైద్యశాలలో కుక్క కాటు నివారణకు వ్యాక్సిన్ ఉండాలి. కానీ ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా వ్యాక్సిన్ అందుబాటులో ఉన్న దాఖలాలు కనిపించటం లేదు. నారాయణగూడలో ప్రత్యేక ఆసుపత్రి ఉన్నప్పటికీ సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు సకాలంలో చేరుకోకపోవటంతో కుక్క కాటుకు గురైన వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కుక్కల నుంచి కాపాడాలి

సఫ్దార్‌నగర్‌లో అర్ధరాత్రి వేళల్లో కుక్కలు దాడులకు దిగుతున్నాయి. కుక్కల బెడదను అరికట్టాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి కుక్కల దాడుల నుంచి ప్రజలను కాపాడాలి.
– ఎండీ అబ్దుల్ హమీద్, సఫ్దార్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

హైదర్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



హైదర్‌నగర్ డివిజన్‌లో మాస్ క్లీన్ డ్రైవ్ ప్రోగాంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ మిత్రహిల్స్ నుంచి మియాపూర్ మెట్రోస్టేషన్ వరకు ఉన్న లింక్ రోడ్డులో జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న మాస్ క్లీన్ డ్రైవ్ ప్రోగ్రాంలో గురువారం స్థానికులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం లింక్ రోడ్డును ఎక్కువ మంది ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్, సైక్లింగ్ కోసం ఉపయోగిస్తున్నారని అన్నారు. అందుకు అనుగుణంగా రోడ్లను శుభ్రంగా ఉండే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు నిత్యం ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. డివిజన్‌లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు. అదే విధంగా హైదర్‌నగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ శ్రీకాంత్, రాంకీ సిబ్బంది, నక్క శ్రీనివాస్, సత్యనారాయణ, హబీబ్, ఏళ్ల స్వామి, కృష్ణారెడ్డి, ఇమ్రాన్, విమల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్‌కు ఘన సన్మానం



ఎమ్మెల్సీగా విజయం సాధించిన నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కూకట్‌పల్లి: ఎమ్మెల్సీగా కుర్మయ్యగారి నవీన్‌కుమార్ విజయం సాధించారు. ఈ సందర్భంగా గురువారం కూకట్‌పల్లిలోని ఆయన నివాసం వద్దకు బీఆర్ఎస్ నాయకులు, బంధువులు, మిత్రులు, గ్రామ పెద్దలు, భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ తండ్రి కుర్మయ్యగారి కొండల్‌రావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీగా నవీన్‌కుమార్ విజయం సాధించిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేయటానికి వెళ్లినట్లు తెలిసింది.

పడితే మ్యాన్‌హోల్‌లోకే.!



మున్సిపల్ కార్యాలయం ఆవరణలోనే మ్యాన్‌హోల్ మూత ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయం లోపలికి వెళ్లే దారిలో ఈ పరిస్థితి ఉంటే ఇంకా కాలనీలు, బస్తీల సమస్యలు ఎలా తీరుస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ వికలాంగులు, వృద్ధులు మెట్లు ఎక్కలేక వెనుక గేట్ నుంచి లోపలికి వెళ్తుంటారు. జోనల్ కమిషనర్, ఇద్దరు ఉప కమిషనర్లు, ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులు వెళ్లే సమయంలో ఇది కనిపించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. – కూకట్‌పల్లి

మెగా జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు చేయాలి



జాబ్ మేళా నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీన జరిగే మెగా జాబ్ మేళాకు సంబంధించి గురువారం అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్, శాంతి భద్రతల విషయంలో ఎటువంటి సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అవసరమైతే వలంటీర్లను నియమించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అనంతరం కూకట్‌పల్లి మెట్రో పార్కు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అధికారులతో సందర్శించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ...

కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 5 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా లక్షలాది రూపాయలను అందజేసి అనేక మందిని ఆదుకున్నామన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యే వారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రాక్టీస్, ట్రెండ్స్‌పై సింపోజియం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సౌత్ ఏషియన్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రాక్టీస్, ట్రెండ్స్‌పై సింపోజియం ముగిసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్‌కు చెందిన బనిసింగ్ రచించిన 'తాంగ్/లాగింగ్', పాకిస్తాన్‌కు చెందిన అనమ్ అబ్బాస్ రచించిన 'దిస్ స్టెయిన్డ్ డాన్'లతోపాటు మయన్మార్, శ్రీలంక, బంగ్లాదేశ్‌కు చెందిన సినిమాలు కూడా ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. దక్షిణాసియా దేశాల్లో డాక్యుమెంటరీ ప్రాక్టీషనర్లు అనుసరించిన పంథాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. ప్రొఫెసర్లు అంజలి మాంటెరో, జయశంకర్, సుమతీ శివమోహన్ పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ మోటార్ సైక్లింగ్ కాంటెస్ట్ షురూ...

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ మోటార్ సైకిల్ బ్రాండ్.. రాయల్ ఎన్‌ఫీల్డ్స్ ఆధ్వర్యంలో చిత్రకారులు, డిజైనర్లు, బైకర్లను ఒక చోట చేర్చి ఆర్ట్ ఆఫ్ మోటార్ సైక్లింగ్ కాంటెస్ట్ నిర్వహిస్తున్నారు. ఆర్ట్ ఆన్ స్ట్రీట్ థీమ్ తదితర ఉత్తేజకరమైన అంశాలతో నిర్వహించే ఈ పోటీలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొనవచ్చునని గెలుపొందిన వారికి నగదు బహుమతులతో పాటు రాయల్ ఎన్‌ఫీల్డ్ డిజైనర్ బృందంతో కలిసి పనిచేసే అవకాశం కూడా లభిస్తుందని బ్రాండ్ నగర ప్రతినిధులు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ వెబ్‌సైట్ అదనపు వివరాలు తెలుసుకుని, ఏప్రిల్ 10వ తేదీలోగా తమ ఎంట్రీ పంపాలని, విజేతల వివరాలు ఆ తర్వాత వారం రోజుల్లోపు ప్రకటిస్తామన్నారు.

మైటోకాండ్రియల్ డీఎన్ఏ వారసత్వంగా సంక్రమిస్తుంది

ప్రొఫెసర్ డగ్లస్ సి వాలెస్



ప్రొ.డగ్లస్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్ నరేష్‌బాబు

రాయదుర్గం: మైటోకాండ్రియల్ డీఎన్ఏ ప్రత్యేకంగా ప్రసూతి వారసత్వంగా సంక్రమిస్తుందని అమెరికాలోని ఫిలడెల్ఫియా చిల్డ్రన్స్ ఆస్పత్రిలోని సెంటర్ ఫర్ మైటోకాండ్రియల్, ఎపిజెనెటిక్ మెడిసిన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డగ్లస్ సి వాలెస్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోకెమిస్ట్రీ విభాగాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైటోకాండ్రియల్ డీఎన్ఏలోని జన్యుపరమైన మార్పులు, జీవక్రియ, క్షీణత, క్యాన్సర్, వృద్ధాప్యం వంటి వ్యాధులకు దారితీస్తాయన్నారు. డీఎన్ఏ మానవ వ్యాధులకు పరమాణు మార్కర్‌గా ఎలా ఉపయోగించబడుతుందో వివరించారు. అంతకుముందు హెచ్‌సీయూలోని బయోకెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ నరేష్‌బాబు బృందంతో సమావేశమై చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం ఆయనను హెచ్‌సీయూ అధికారులు ఘనంగా సత్కరించారు.

నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలి



కైత్లాపూర్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్, అధికారులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్‌లో రోడ్డు విస్తరణ కోసం జరుగుతున్న పనులను మాజీ కార్పొరేటర్ బాబూరావు, డీఈఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ డీఈ స్వప్నతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం కేపీహెచ్‌బీకాలనీ ధనలక్ష్మిసెంటర్ పార్కు డెవలప్‌మెంట్ పనులు, కేపీహెచ్‌బీ కాలనీ02లో జరుగుతున్న కల్వర్టు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కైత్లాపూర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకే రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు.

దరఖాస్తుదారులకు నేడు ముఖాముఖి

పటాన్‌చెరు టౌన్: మైనార్టీ ఆర్థిక ఆసరా (ఎకనామిక్ సపోర్టింగ్) పథకం కింద, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు రామచంద్రాపురం గ్రేటర్ మహిళా భవన్‌లో ముఖాముఖికి హాజరుకావాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

'ఆలయాలను పునర్ నిర్మించుకోవడం ఆనందంగా ఉంది'



కొనసాగుతున్న శ్రీశివరామాంజనేయ త్రికుటాలయం దేవాలయ పనులు

మోతీనగర్: జనప్రియనగర్‌లోని శ్రీశివరామాంజనేయ త్రికుటాలయం దేవాలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఈ దేవాలయంలో శ్రీగణపతిస్వామి శివాలయం, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, నవగ్రహ మండపాలను సుమారు 8 వందల గజాల స్థలంలో చేపట్టారు. ఈ దేవాలయాన్ని స్థానికుల సహకారంతో రాజకీయాలు, కులమతాలకు అతీతంగా దాతలు ముందుకొచ్చి స్వచ్ఛందంగా వచ్చి విరాళాలు అందజేశారు. త్వరలోనే ఆలయ పనులు పూర్తి చేస్తామని బస్తీ సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎంతో మహిమలు ఉన్న ఈ ఆలయాలను తిరిగి పునర్నిర్మించుకోవటం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు కొండం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అధ్యక్షుడు బొమ్మిడడి నాగరాజు, బస్తీ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సనపాల ఆదినారాయణ, ఆదిరెడ్డి, జి.రాములు, పేశెట్టి సూర్యప్రకాష్, మురళి, తిరుపతిరావు, ముకుందర్‌రెడ్డి, జయభేరి శ్రీనువాస్, విజయేందర్, చక్రపాణి, శ్రీనివాస్‌గౌడ్, సోమిరెడ్డి, సాయిరామ్, శ్రీనివాసాచారి తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి వలసలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



మహిళకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌కి చెందిన బీజేపీ మహిళా నాయకురాలు సురేఖ గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కొత్తగా చేరిన వారి సలహాలు, సూచనలు తీసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నెహ్రూనగర్‌లో ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయ్యిందన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీలో చేరి సైనికుడిలా పనిచేయాలని సూచించారు. ప్రతి కార్యకర్తను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని... అదే విధంగా పలు ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ కష్టపడి బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు గురువారం మంజూరైన రూ.21.71లక్షల మొత్తాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ భరోసానిస్తోందన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు సహకారం అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు చంద్రకాంత్‌రావు, చంద్రారెడ్డి, చంద్రమోహన్ సాగర్, విద్యాసాగర్, అష్రఫ్, శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ